ఆధునికీకరణకు నోచుకోని కాజ్‌వేలు


మూలకుద్దు ఎస్సీ కాలనీ వద్ద చెక్‌డ్యామ్‌కు ఇరువైపులా కూలిపోయిన రక్షణ స్తంభాలు


ఉప్పగల్లీలు వద్ద కాజ్‌వేపై ఇరువైపులా కూలిపోయిన రక్షణ స్తంభాలు

రాకపోకలకు తప్పని ఇబ్బందులు

తగరపువలస : భీమిలి మండలం కొత్త మూలకుద్దు గ్రామంలో గోస్తనీ నది ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న చిల్లపేట – భీమిలి రహదారిలో చెక్‌డ్యామ్‌లు, కాజ్‌వేలు ఆధునికీకరణకు నోచుకోలేదు. ఫలితంగా భవిష్యత్‌లో ప్రమాదాలు సంభవించే సూచనలు కనిపిస్తున్నాయి. గోస్తనీ నదిని ఆనుకుని ఉన్న మూలకుద్దు పంచాయతీకి తూర్పున ఉప్పుగల్లీలు, ఉప్పుటేరు, ఉత్తర దిక్కున గోస్తనీనది, దక్షిణ దిక్కున ఉప్పుటేరు ఉన్నాయి. గోస్తనీ నదికి ఎప్పుడు వరదలు వచ్చినా ఇరువైపులా ఉన్న కొత్త మూలకుద్దు, పాత మూలకుద్దు గ్రామాల్లో కొంత మేరకు భూభాగాలు కోతకు గురవుతుంటాయి. మూడు వైపులా వరదనీటితో కొత్త మూలకుద్దు గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుంటాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ పంచాయతీ శ్రీరామనగర్ మీదుగా కొత్త మూలకుద్దుకు ప్రత్యామ్నాయంగా బీటీరోడ్డు వేసినా అది కూడా గోస్తనీనదిని ఆనుకుని ఉండడంతో ఈ మార్గానికి కూడా ముంపు భయం పొంచి ఉంది. దీనికి బదులుగా తగరపువలస, భీమిలి వైపు రాకపోకలు సాగించాలంటే కొత్త మూలకుద్దు గ్రామ ప్రజలు చెక్‌డ్యామ్‌లు, కాజ్‌వేల మీదుగా చిల్లపేట ద్వారానే ఎక్కువగా వాహనాలను ఉపయోగించి రాకపోకలు సాగిస్తుంటారు.

ఎత్తు పెంచి... పటిష్టం చేయాలి

ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యామ్, కాజ్‌వేల ఎత్తు పెంచడంతోపాటు వాటికి ఇరువైపులా రక్షణగా పిల్లర్లు ఏర్పాటు చేయాలి. గతంలో వీటిని నిర్మించినప్పుడు ఉండే పిల్లర్లు ప్రస్తుతం శిథిలమై కనిపించడం లేదు. సాధారణ రోజుల్లో కూడా చీకటి పడిన తర్వాత కొత్త వ్యక్తులు ఈ కొత్త మూలకుద్దు వస్తే రక్షణ పిల్లర్లు లేని చెక్‌డ్యామ్, కాజ్‌వేపై అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు స్థానికులు కూడా మద్యం మత్తులో వీటిపై ప్రయాణించినప్పుడు ఇబ్బందులు పడుతుంటారు. అందువల్ల వీటి ఎత్తు పెంచి ఇరువైపులా రక్షణ పిల్లర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చిల్లపేట – భీమిలి రోడ్డు నుంచి కొత్త మూలకుద్దు వరకు రెండున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం ఇరుకుగా కూడా ఉండటంతో తరచూ ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం కూడా సంభవిస్తోంది. దీంతో ఈ రహదారిని విస్తరించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కేథరిన్ స్కూల్ సమీపంలో కాజ్‌వేపై ఇరువైపులా లేని రక్షణ స్తంభాలు

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవాలు



విశేష అలంకరణలో మహా కామేశ్వర స్వామి... ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మధురవాడ : మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం 5వ వార్షికోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆదివారం ఉదయం 6 గంటలు నుంచి మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అఖండ దీపారాధన, కళశ స్థాపన, వాస్తు మండపారాధన, నవగ్రహ మండప ఆవాహనం, అగ్ని ప్రతిష్ట చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో హోమాలు చేశారు. ఈ సందర్భంగా మహా కామేశ్వర స్వామి, లలితా త్రిపుర సుందరీ దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్, కమిటీ సభ్యులు ప్రతాపరాజు, జేడీ నాయుడు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. పూజల్లో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సోమవారం ఉదయం సాంప్రదాయ పూజల అనంతరం మహా కామేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేయనున్నారు. అదేరోజు సాయంత్రం కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఉత్సవమూర్తుల పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఘనంగా సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం


సామూహిక వ్రతంలో పాల్గొన్న బాలురు

భీమునిపట్నం : భీమిలిలోని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, అనంతరం నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు, పాలాభిషేకం, అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. బాల వికాస్ పిల్లలతో సత్యసాయి సామూహిక వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు.

2న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

తగరపువలస : భీమిలి మండలం టి.నగర పాలెం పంచాయతీ గొల్లలపాలెంలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయం రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి కోలాటంతో పార్వతీ పరమేశ్వరుల పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తారు. అర్చకుడు ఏడిద కార్తీక శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

కొమ్మాది : ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా జీవీఎంసీ 4వ వార్డులో పలు చోట్ల విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. నిడిగట్టు, బోయిలూరు, కొత్తవలస ప్రాంతాల్లో విష జ్వరాలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడం, మలేరియా విభాగం అధికారులు పర్యటించకపోవడం, ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేయకపోవడంతో దోమలు, ఈగలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి వలనే విష జ్వరాలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం కాలువల్లో బ్లీచింగ్ అయినా చల్లే పరిస్థితి లేదని, ఈ ప్రాంతాల్లో గల సచివాలయాలకు సమస్యలు చెప్పుకుందామన్నా అధికారులు అక్కడ ఉండడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతాల్లో మందులు పిచికారీ చేయించి, బ్లీచింగ్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు.

3న సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం

పీఎం పాలెం : స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెంకు వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు మఠం గౌరవ పాలనా ప్రతినిధి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ రోజు స్వామికి విశేష పంచామృత అభిషేకాలు, ఉదయం 11 గంటలకు సుబ్రహ్మణ్యహోమం, 12 గంటలకు పూర్ణాహుతి, ప్రసాద వినియోగము, సాయంత్రం అర్చన, మహా మంగళ హారతి ప్రసాద వితరణతో ఉత్సవ కార్యక్రమం ముగుస్తుందని ఆయన తెలిపారు.

రుషికొండ బీచ్‌లో సమస్యలతో సతమతం


రుషికొండ బీచ్‌కు వెళ్లే మార్గంలో శిథిలమైన మెట్లు


పెచ్చులూడిపోతున్న బీచ్ కంట్రోల్ అవుట్ పోస్ట్ బిల్డింగ్

కొమ్మాది : బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. విశాలమైన ప్రదేశం, కనువిందు చేసే ప్రకృతి తీరం, బోట్ షికారు, చిల్డ్రన్స్ పార్క్, వ్యాపార సముదాయం, ఫొటోషూట్స్ సమూహమే ఈ రుషికొండ బీచ్. ప్రస్తుతం ఈ బీచ్ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ఇక్కడ తీరానికి వెళ్లే మెట్ల మార్గం గతంలో కోతకు గురై ధ్వంసమైంది. గతంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ప్రస్తుతం తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకుంది. పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే బీచ్ కంట్రోల్ అవుట్ పోస్ట్ కార్యాలయం కూడా పెచ్చుపెచ్చులుగా ఊడి శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మత్స్యరాశుల పార్కు, సముద్ర ప్రమాదాల దిశగా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు దెబ్బతిన్నాయి. మరోవైపు పారిశుధ్య నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కుటీరాలు కూడా దెబ్బతిన్నాయి. మరుగుదొడ్ల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. ఫలితంగా ఎన్నో ఆశలతో ఇక్కడకు వచ్చే పర్యాటకులు సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దుర్వాసన, చెత్త పర్యాటకులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

రోడ్డు మీదకు విస్తరించిన ముళ్లపొదలు


రోడ్డు మీదకు విస్తరించిన ముళ్ల పొదల చెట్లు

పద్మనాభం : మండంలోని రెడ్డిపల్లి నుంచి పాట్నూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదకు ముళ్ల జాతికి చెందిన కంచిక చెట్లు విస్తరించాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు వెడల్పు తక్కువ కావడంతో లారీలు వంటి పెద్ద వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు వాటిని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనచోదకులు, ఆటోల్లో పయణించే వారికి ముళ్ల పొదలు తగలడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముళ్ల పొదలు తగులుకోవడం వల్ల కంటికి హాని కలిగే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మీదకు ఆవరించిన ముళ్ల పొదల చెట్లను తొలగించాలని ప్రయాణికులు కొరుతున్నారు.

కుళాయిలకు ప్లాట్‌ఫారాలు నిర్మించండి


లక్ష్మీపురంలో ప్లాట్‌ఫారం లేక నిల్వ నీటిలో వీధి కుళాయి

తగరపువలస : భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో పబ్లిక్ కుళాయిలకు ప్లాట్‌ఫారాలు లేక అపరిశుభ్రమైన వాతావరణంలో మహిళలు తాగునీరు పట్టుకోవాల్సి వస్తోంది. కొన్ని చోట్ల కుళాయిల నుంచి వృథాగా వచ్చే నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో అక్కడే మడుగులా ఏర్పడి భూమిలో ఇంకుతోంది. అసలే వర్షాకాలం వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పంచాయతీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పబ్లిక్ కుళాయిలకు ప్లాట్‌ఫారాలు నిర్మించి నీరు బయటకు వెళ్లిపోయేలా కాలువలకు అనుసంధానించాలని కోరుతున్నారు. కుళాయిల చుట్టూ స్థానికులు చెత్త వేయకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీ రహదారి అడుగడుగునా శిథిలం


తాళ్లవలస పీహెచ్‌సీ సమీపంలో శిథిలమైన బీటీ రోడ్డు


గొల్లల తాళ్లవలస వద్ద శిథిలమైన బీటీ రోడ్డు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి అడుగడుగునా గోతులమయమై రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేదని స్థానికులు వాపోతున్నారు. తాళ్లవలస జాతీయ రహదారి నుంచి భీమిలి – దొరతోట వరకు కిలోమీటరు పొడవున్న ఈ రోడ్డును 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10 లక్షలతో మరమ్మతులు చేపట్టింది. ఈ మరమ్మతులు చేపట్టిన వారం రోజులకే వర్షాలకు రహదారి ఆనవాళ్లు కోల్పోయింది. భీమిలి మండలంలోని వివిధ పంచాయతీల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ముఖ్యంగా ఈ ఆస్పత్రిలో కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు చేయించుకునే మహిళలు శిథిల రహదారిపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో జీవీఎంసీ 4వ వార్డు, ఆనందపురం మండలంలోని గ్రామాలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై కూడా సాఫీగా ప్రయాణించలేకపోతున్నారు. వీరి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీ రహదారిని నాణ్యమైన మెటీరియల్‌తో పునరుద్ధరించాలని భీమిలి మండల ప్రజలు కోరుతున్నారు.

దేవస్థానంలో ఉద్యోగం ఓ వరం


రామానుజంను సన్మానిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, రాజగోపాల్, శ్రీనివాసాచార్యులు, అర్చకులు

సింహాచలం: దేవస్థానంలో ఉద్యోగం చేయడం భగవంతుడు ఇచ్చిన ఓ వరం లాంటిది.. అది కొందరికే లభిస్తుందని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. సింహాచలం దేవస్థానంలో నాలాయర అధ్యాపకుడిగా పనిచేసి ఆదివారం పదవీవిరమణ చేసిన నిడమర్తి కందాడై వరాహ కృష్ణ రామానుజంను సింహగిరిపై కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో ఉద్యోగం చేయడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. వైదిక వృత్తి ఎంతో గొప్పదన్నారు. రామానుజం 38 ఏళ్ల పాటు ఆదర్శంగా సేవలందించారని కొనియాడారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం దత్తత ఆలయమైన పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి ఆయంలో నిత్య అధ్యాపక,రామాయణ పారాయణదారుగా ఉద్యోగం పొందిన రామానుజం 1992లో సింహాచలం దేవస్థానానికి వచ్చారన్నారు. 2021లో ఉపనిషత్ పారాయణదారునిగా, 2016లో నాలాయర అధ్యాపకునిగా పదోన్నతులు పొందారని చెప్పారు. రెండుసార్లు ఉత్తమ ఉద్యోగిగా కూడా రామానుజం అవార్డులు అందుకోవడం గొప్పవిషయమన్నారు. దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఉద్యోగులు చక్రవర్తి పాల్గొన్నారు.

47 మంది యువకుల రక్తదానం


తాటితూరులో రక్తదానం చేస్తున్న యువకులు

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు హెల్పింగ్ హేండ్స్ 3వ వార్షికోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 47 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు యశీన్, కార్యదర్శి చింతా నేతాజీ, హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకుడు పల్లంటి శ్యామ్‌సుందరరావు పాల్గొన్నారు.

తర్లువాడ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం


శిథిలమైన తర్లువాడ రహదారి

తగరపువలస : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో శిథిలమైన రహదారులపై ప్రయాణం కష్టంగా ఉంటుందని కోరాడ ఆదినారాయణ అనే స్వచ్ఛంద సేవకుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పంచాయతీలో ఫార్మసీ కళాశాలతో పాటు హోమియో వైద్యానికి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అంతేకాకుండా రైతులు నిత్యం తమ ఉత్పత్తులను ఈ శిథిలమైన రహదారులపై తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్లు తప్ప వీటికి మరమ్మతులు కూడా జరగలేదన్నారు. గుంతలు ఏర్పడిన రోడ్డుపై ప్రయాణం చేయలేక చాలామంది ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. వీరి కష్టాలను దృష్టిలో పెట్టుకుని తర్లువాడకు రహదారులు కొత్తగా నిర్మించాలని కోరుతున్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సింహాచలేశుడిని దర్శించుకోవడానికి బారులు తీరారు. దీంతో గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగల తో అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ మాస శుద్ధ నవమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


గొట్టిపల్లిలో ప్రచారంలో ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీతపై ఆనందపురం మండలంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయంలోని 17వ శ్లోకం గురించి గొట్టిపల్లి, వెంకటాపురం, చందక గ్రామాల్లో వివరించారు. క్షర పురుషుడు జీవాత్మ అని, అక్షర పురుషుడు ఆత్మ అని వివరించారు.

జీవాత్మ, ఆత్మ, పరమాత్మ ఆధ్యాత్మికంలో ముఖ్యమైనవన్నారు. వీటి ఆధారంగానే త్రైత సిద్ధాంత భగవద్గీతను ఆచార్య ప్రబోధానందుడు రచించారన్నారు. ప్రచార కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.శ్రీనివాస్, భవాని, అంకమ్మ, కళావతి, నరసయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో రెండో దఫా కౌన్సెలింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 25న నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 27, 28 తేదీల్లో మొదటి దఫా కౌన్సెలింగ్‌లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం అభ్యర్థులు ఏ ఐటీఐలో సీటు కావాలో ఆ ఐటీఐకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఆర్ కార్డుదారులు దరఖాస్తులో ఎస్‌పీ అని నమోదు చేసుకోవాలని సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెల్ ప్రారంభం

ఎంవీపీకాలనీ : లాసన్స్ బే కాలనీలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెల్‌ను ఆదివారం ప్రారంభించారు. లయన్స్ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎంఎం మహేష్, పూర్వ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, బీజేపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన యువతీ యువకులు, మహిళలకు కనీస విద్యార్హత కలిగిన వారికి ఉచితంగా నాలుగు నెలల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, ఎంఎస్ ఆఫీసులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్

బీచ్‌రోడ్డు : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదివారం నగరంలోని చార్టెర్డ్ అకౌంటెంట్లు వికసిత్ భారత్ పేరుతో 2కే రన్ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ రన్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అనిర్బన్పాల్ ప్రారంభించారు. సీఏ డే సందర్భంగా ప్రధాని పిలుపు మేరకు ఈ రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు.